క్లుప్తంగా

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే విరూపాక్షి

చిప్పగిరి: ఆలూరుకు చెందిన గోబీ బసవరాజు, సరస్వతి దంపతుల కుమారుడు మధు సెపక్‌తక్రాలో అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా సోమవారం చిప్పగిరిలో ఎమ్మెల్యే విరూపాక్షి మధును అభినందించి రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. అంతర్జాతీయ స్థాయిలో రాణించి దేశానికి స్వగ్రామానికి పేరు తేవాలని సూచించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళాన్ని అందజేస్తున్న దాతలు

మద్దికెర: మండలంలోని ఎం.అగ్రహారం గ్రామంలో శ్రీకృష్ణుడి ఆలయ నిర్మాణానికి మండల కేంద్రానికి చెందిన శ్రీవిద్యాసాయి విద్యాసంస్థల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ వెంకట్‌మాధవ్, సునీత రూ.51,116 విరాళాన్ని ఆలయ నిర్వాహకులకు సోమవారం అందజేశారు.

నీటి సమస్య పరిష్కారానికి కృషి



కడమకుంట్లలో ఇంటింటికీ కుళాయిలను ప్రారంభిస్తున్న దృశ్యం

తుగ్గలి : నీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని సర్పంచ్ మస్తాన్‌బీ తెలిపారు. కడమకుంట్ల గ్రామంలో కొట్టాలవీధి, బొడ్రాయి నుంచి మసీదు వరకు ఏర్పాటు చేసిన ఇంటింటికీ కుళాయిలను సోమవారం ప్రారంభించారు. దాదాపు రూ.3లక్షలతో కుళాయిలు ఏర్పాటు ఆమె చేసినట్లు చెప్పారు. సుల్తాన్, వెంకటేశ్వర్లు, హనుమంతు, సుధాకర్, కాశీం పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ షురూ



నిట్రవట్టిలో వివరాలు సేకరిస్తున్న డీఆర్‌పీ

హాలహర్వి: మండలంలో సోమవారం 17వ విడత సామాజిక తనిఖీ ప్రారంభమైందని ఏపీఓ హేమసుందర్, ఎస్‌ఆర్‌పీ విజయభాస్కర్ తెలిపారు. ఈ మేరకు ఉపాధి హామీ పథకం కింద జరిగిన పనులపై ఆయా గ్రామాల్లో సామాజిక తనిఖీ చేపట్టారు. నిట్రవట్టి గ్రామంలో జరిగిన పనులపై డీఆర్‌పీలు ప్రజలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈనెల 24వ తేదీన సామాజిక బహిరంగ సభ ఉంటుందని చెప్పారు.

చౌడేశ్వరీదేవి ఉత్సవాలు ప్రారంభం



పత్తికొండలో చౌడేశ్వరీదేవికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పత్తికొండ(తుగ్గలి) : పట్టణంలో వెలసిన చౌడేశ్వరీదేవి జ్యోతుల ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. వేకువజామునే అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, అర్చనలు, గణము, గంగపూజ తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. మంగళవారం తెల్లవారుజామున జ్యోతుల మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రత్యేక పూజలు



పల్లకీసేవ నిర్వహిస్తున్న భక్తులు

దేవనకొండ: మండల కేంద్రంలో శ్రీలక్ష్మీ సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపన, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ జరిగి 41 రోజులు పూర్తి కావడంతో ప్రత్యేక పూజా కార్యక్రమాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు, పురోహితుల మంత్రోచ్చారణల నిత్య పూజలతో పాటు విశేష పూజలు చేపట్టారు. అనంతరం వేంకటేశ్వరస్వామి వారి ఉత్సవమూర్తులకు పల్లకీ సేవ జరిపించారు. కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. జెడ్పీటీసీ రామకృష్ణ, సిలివేరు రామాంజనేయులు, ఎర్రం రంగప్ప, రంగస్వామి, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

సాగు నీటి కష్టాలు

- నిరుపయోగంగా ఆలూరు బ్రాంచ్ కెనాల్
- 12 ఏళ్లుగా హెచ్‌ఎల్‌సీ నుంచి ఏబీసీకి విడుదల కాని నీరు
- ప్రశ్నార్థకంగా 14,265 ఎకరాల ఆయకట్టు
- పంటల సాగుకు రైతులకు తప్పని పాట్లు
- హంద్రీనీవా నుంచి ఏబీసీకి తూము ఏర్పాటు చేస్తే 50వేల ఎకరాలకు లబ్ధి
- సస్యశ్యామలంగా మారనున్న పశ్చిమ ప్రాంతం

ఆలూరు నియోజకవర్గంలో వివిధ గ్రామాల్లోని పొలాలకు నీరందించేందుకు ఆలూరు బ్రాంచ్ కెనాల్ (ఏబీసీ)ను తుంగభద్ర ఎగువ కాలువ నీటి ఆధారంగా నిర్మించారు. అయితే 12 ఏళ్లుగా కాలువకు నీరు విడుదల చేయకపోవడంతో నిర్దేశించిన 14,265 ఎకరాల ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారింది. కొన్నేళ్ల క్రితం ఏర్పాటు చేసిన హంద్రీనీవా ప్రధాన కాలువ నిండుగా ప్రవహిస్తున్నప్పటికీ అధికారికంగా ఏబీసీకి నీటి విడుదలకు అనుమతివ్వలేదు. హంద్రీనీవా నుంచి ఏబీసీకి తూము ఏర్పాటు చేస్తే దాదాపు 50వేల ఎకరాలకు సాగు నీరందుతుందని, ఈ ప్రాంతం సస్యశ్యామలంగా మారుతుందని, కరువును పారద్రోలవచ్చని రైతులు పేర్కొంటున్నారు.



హంద్రీ నీవా కాలువ 155 కి.మీ. వద్ద నీరు విడిపించుకుంటున్న మండల రైతులు (ఫైల్)



చిప్పగిరి వద్ద నిండుగా హంద్రీ నీవా కాలువ



చిప్పగిరి వద్ద ఏబీసీలో తక్కువ నీరు ప్రవహిస్తున్న దృశ్యం

చిప్పగిరి : మండలంలో ఆలూరు బ్రాంచ్ కెనాల్ పరిధిలోని ఆయకట్టు రైతుల ఆశలు నెరవేరడం లేదు. హెచ్‌ఎల్‌సీ నుంచి 12 ఏళ్లుగా మండలంలోని ఏబీసీ కాలువలకు నీరందరక ఆయకట్టు వర్షాధార పంటలకే పరిమితమైంది. చిప్పగిరి మండలానికి ప్రధాన సాగునీటి వనరు ఏబీసీ. ఈ కాలువ పరిధిలో 45 కి.మీ. ఉంటూ, 19 పంట కాలువలున్నాయి. వీటి కింద చిప్పగిరితో పాటు మండలంలోని ఏరూరు, డేగులహాలు, గుమ్మనూరు, కాజీపురం,బంటణహాలు,బెల్డోణ,కొట్టాల,గ్రామాలతో పాటు హాలహర్వి, ఆలూరు మండలాల్లోని పలు గ్రామాలకు కలిపి మొత్తం 14,265 ఎకరాల వరకు ఆయకట్టు ఉంది.

హంద్రీ–నీవాకు తూము ఏర్పాటు చేస్తే..

ఆయా గ్రామాల్లోని పొలాల్లో ప్రధానంగా మిరప, పత్తి, వరి పంటలు సాగు చేస్తారు. హెచ్‌ఎల్‌సీ నుంచి ఏబీసీకి నీరందకపోవడంతో మండలంలో ప్రవహిస్తున్న హంద్రీనీవా నీటిపై రైతులు ఆధారపడ్డారు. హంద్రీ నీవా కాలువ 155 కి.మీ. వద్ద తూము ఏర్పాటు చేసి ఏబీసీ నీటిని విడుదల చేయాలని కొన్నేళ్లుగా రైతులు కోరుతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా వారి విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకోలేదు. అయినప్పటికీ రైతులు అనధికారికంగా నీటిని తరలించి పంటలు సాగు చేసుకుంటున్నారు. అయితే నీటి విడుదల పూర్తిగా అధికారుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉండటం, సీజన్ ముగిసేలోపు పలుమార్లు తూమును మట్టి,రాళ్లతో పూడ్చివేస్తున్నారు. అన్నదాతలు వారిని బతిమలాడుకొని మళ్లీ నీటి విడుదల చేయించుకోవాల్సి వస్తుంది. ఇలాంటివి కాకుండా అధికారికంగా తూము ఏర్పాటు చేస్తే.. ప్రస్తుతం ఉన్న ఆయకట్టుతో పాటు మరో 35వేల ఎకరాలకు పైగా అంటే దాదాపు 50వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని, వలసలు తగ్గి ఈ ప్రాంతం సస్యశ్యామలంగా మారుతుందని రైతులు పేర్కొంటున్నారు.

సత్వరమే తూము ఏర్పాటు చేయాలి



మండల కేంద్రం చిప్పగిరితో పాటు హాలహర్వి, ఆలూరు మండలాలు సస్యశ్యామలంగా మారాలంటే.. హంద్రీ నీవా కాలువకు తూము ఏర్పాటు చేయాలి. ఇందుకు కూటమి ప్రభుత్వం సత్వరమే చర్యలు చేపట్టాలి. ఈ తూము ద్వారా ఏబీసీ కెనాల్‌కు అధికారికంగా నీరు విడుదల చేస్తే సుమారు 50 వేల ఎకారాల వరకు నీరు అందుతుంది. దీంతో కెనాల్ ఆయకట్టు రైతులతో పాటు వేలాది మంది రైతు కూలీలకు కూడా ఉపాధి లభిస్తుంది. దీంతో వలసలను కూడా అడ్డుకోవచ్చు. – విరూపాక్షి, ఎమ్మెల్యే

తూము ఏర్పాటుతో అధికారికంగా నీరు అందుతుంది



ఏబీసీ కాలువకు హంద్రీ నీవా నుంచి తూము ఏర్పాటు చేస్తే అధికారికంగా నీరు అందుతుంది. నీరు పుష్కలంగా ఉంటే ఎలాంటి భయం లేకుండా పంటలు సాగు చేసుకుంటాం. ప్రస్తుతం అనధికారికంగా నీటి విడుదల ఉండటంతో ఎప్పుడు నీరు ఆగిపోతుందో తెలియని ఆయోమయ పరిస్థితి. లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేసిన తరువాత మధ్యలో నీరు ఆగిపోతే తీవ్రంగా నష్టపోతాం. తూము ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలి. – లాల్ స్వామి, రైతు,దేగులహాలు

అధికారికంగా నీటి కేటాయింపులు చేపట్టలేదు



హంద్రీ నీవా కాలువకు సంబంధించి ప్రాజెక్టు అసంపూర్తిగా ఉండటంతో ఇటు కర్నూలు, అటు అనంతపురం జిల్లాల్లో అధికారికంగా ఎలాంటి నీటి కేటాయింపులను ప్రభుత్వం చేపట్టలేదు. దీంతో 2023లో హంద్రీ నీవా కాలువపై ఏబీసీ తూము ఏర్పాటుకు సంబంధించి 10 ఎకరాలు (సుమారు ఒక కి.మీ) వరకు భూమి సేకరణకు ప్రతిపాదనలు పంపగా నీటి కేటాయింపు తర్వాత ప్రతిపాదనలు పంపాలని ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు. మళ్లీ ప్రతిపాదనలు పంపుతాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే తూము ఏర్పాటుకు చర్యలు చేపడతాం. – మంజునాథ్, డీఈ

నేడు నులిపురుగు నిర్మూలన దినోత్సవం

తుగ్గలి : జాతీయ నులిపురుగు నిర్మూలన దినోత్సవాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు తుగ్గలి, పగిడిరాయి పీహెచ్‌సీల వైద్యులు ప్రవీణ్‌కుమార్, హరిత తెలిపారు. 19 ఏళ్ల లోపు పిల్లలందరూ ఆల్బెండజోల్ మాత్రలు వేసుకునేలా వైద్య సిబ్బంది సిద్ధం చేశామన్నారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులను సమన్వయం చేసుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ఆస్పరి: ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కేవీ నారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని హంద్రీ పరివాహక ప్రాంతాల్లో రైతులు వేసిన పత్తి, వేరుశనగ, ఉల్లి, టమాట పంటలు పూర్తిగా నష్టపోయారన్నారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30 వేల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. ఈ సంవత్సరం రబీ సీజన్‌లో 70 శాతం సబ్సిడీతో రైతులకు పప్పు శనగ విత్తనాలను అందించాలన్నారు. హనుమంతు, మల్లేష్, బాలకృష్ణ, రామాంజినేయులు, సుందరరాజు, యూసిఫ్, మధురెడ్డి, రవి పాల్గొన్నారు.

నేటి నుంచి 'స్వచ్ఛతాహీ సేవా'

ఆస్పరి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు అభివృద్ధి చేసుకోవడానికి మండలంలోని 33 గ్రామాల్లో మంగళవారం నుంచి స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాణెమ్మ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ స్వభావ్ స్వచ్ఛత- సంస్కార్ స్వచ్ఛత అనే నినాదంతో అక్టోబర్ 1వ తేదీ వరకు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. పరిసరరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు శ్రమదానం పేరిట అభివృద్ధి పనులు, ప్రతిజ్ఞ, ర్యాలీలు, మారథాన్ రన్, వర్క్‌షాపులు, అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించామని చెప్పారు.

ప్రవక్త మార్గం అనుసరణీయం



ఆలూరు జామియా మసీదులో ఆసర్ ముబారక్ దర్శించుకుంటున్న ముస్లింలు



హొళగుందలో బస్టాండులో బయాన్ చెబుతున్న మౌలిసాబ్‌లు

- ఘనంగా మిలాద్–ఉన్–నబీ

ఆలూరు రూరల్: మహమ్మద్ ప్రవక్త మార్గం అనుసరణీయమని ముస్లిం మత గురువులు తెలిపారు. మిలాద్–ఉన్–నబీ వేడుకలు సోమవారం ఆలూరులో ఘనంగా నిర్వహించారు. మత గురువులు మాట్లాడుతూ.. సమాజంలో నెలకొన్న చీకట్లను చీల్చే సూర్యుడిలా వందల ఏళ్ల క్రితమే అభ్యుదయ భావాలతో ఉదయించి సమస్త మానవళికి మార్గ నిర్దేశం చేసిన మహనీయుడు అల్లాహ్ ప్రవక్త మార్గం అందరికీ అనుసరణీయమం అన్నారు. ఇస్లాంను విశ్వ వ్యాప్తం చేసిన వారిలో చివరి ప్రవక్తగా ఖ్యాతిగాంచిన మహమ్మద్ నబీ రసూల్ అల్లాహ్ పుట్టిన రోజును మిలాద్–ఉన్–నబీగా పరిగణిస్తున్నారని తెలిపారు. శాంతి,ధర్మం, సమానత్వం తోటి వారి పట్ల ఎలా మెలగాలో బోధించిన మహమ్మద్ ప్రవక్త.. సంపూర్ణ ఆధ్యాత్మికతను, తాత్విక చింతనకు మారుపేరుగా నిలిచారన్నారు.

ఘనంగా జులూస్

మిలాద్–ఉన్–నబీ సందర్భంగా ఆలూరులోని స్థానిక జామియా మసీద్ నుంచి అంబేడ్కర్ సర్కిల్, మెయిన్ బజార్,గుంతకల్లు చెక్ పోస్టు మీదుగా ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం అల్లాహ్, ప్రవక్త మహమ్మద్ జీవిత చరిత్రపై ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. అంతకు ముందు జామియా మసీదులో ఆసర్ ముబారక్ (మహమ్మద్ ప్రవక్త రోమాన్ని) దర్శించుకున్నారు.

పత్తికొండ(తుగ్గలి) : మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా సోమవారం పత్తికొండ, తుగ్గలి మండలాల్లో మిలాద్–ఉన్–నబీ వేడుకలను ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఆయా మసీదుల్లో ప్రార్థనలు నిర్వహించారు. సాయంత్రం పత్తికొండ పట్టణంలో ప్రధాన రహదారిలో భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు.

వెల్దుర్తి: మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం మండలంలోని ముస్లిములు మిలాద్–ఉన్–నబీ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండల కేంద్రంలో మొదటి సారిగా ర్యాలీ నిర్వహించారు. జామియా మసీదు నుంచి పాతబస్టాండుకు చేరుకుని ప్రజలకు స్వీట్లు పంచారు.



పత్తికొండలో ముస్లింల ర్యాలీ



వెల్దుర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు



మద్దికెరలో ఊరేగింపుగా..



ఆలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు



హొళగుందలో ..



దేవనకొండలో ఊరేగింపుగా వెళ్తున్న ముస్లింలు



హాలహర్విలో..



ఆస్పరిలో..

ఎట్టకేలకు సీసీ రోడ్డు ఏర్పాటు



హొళగుంద పేట బసవేశ్వరస్వామి ఆలయం వద్ద సీసీ రోడ్డు వేస్తున్న దృశ్యం



నాడు అధ్వానంగా ఉన్న రోడ్డు (ఫైల్)

హొళగుంద: చాలా కాలంగా సీసీ రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్న స్థానిక పేట బసవేశ్వరస్వామి ఆలయ పరిసర వాసులు, గ్రామస్తుల సమస్య ఎట్టకేలకు తీరింది. సోమవారం ఎంపీపీ నూర్జహాన్‌బీ ఆధ్వర్యంలో మండల పరిషత్ నిధులు దాదాపు రూ.6 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. గతంలో గ్రామస్తులు ఈ రోడ్డుపై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. అలాగే మురుగు నీరు నిలిచి పారిశుద్ధ్యం లోపించి దోమల బెడద తీవ్రంగా ఉండేది. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో నిధులు విడుదలవడంతో పనులు ప్రారంభించారు. ఈశా, ఎంపీటీసీలు కెంచప్ప, శివన్న, మల్లయ్య, రమేష్ పాల్గొన్నారు.

పేదింటి బిడ్డలకు ఎంబీబీఎస్ సీటు



ఎల్లార్తి రమ్యశ్రీ

హొళగుంద: తల్లి కూలీకి ..తండ్రి గొర్రెలు కాస్తేనే ఆ కుటుంబం గడుస్తుంది. అయితేనేం పేదరికాన్ని లెక్కచేయకుండా కష్టపడి చదివి నీట్‌లో మంచి ప్రతిభ కనబరిచి ఎంబీబీఎస్ సీటు సాధించి ఆదర్శంగా నిలిచింది ఓ విద్యార్థిని. మండలంలోని ఎల్లార్తి గ్రామానికి చెందిన మాల ఈరన్న, శేఖమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పెద్ద కుమార్తె రమ్యశ్రీ ఇటీవల నిర్వహించిన నీట్–2024 లో 536/720 మార్కులు సంపాదించి రాష్ట్ర ర్యాంకు 5,540 సాధించింది. మొదటి విడత కౌన్సెలింగ్‌లో తిరుపతి పద్మావతి మహిళా వైద్య కాలేజీలో సీటు లభించింది.

కంబాలపాడులో రైతు బిడ్డకు..



దూదేకుల రజిత్

కృష్ణగిరి: మండలంలోని కంబాలపాడు గ్రామానికి చెందిన దూదేకుల రజిత్ కర్నూలు మెడికల్ కాలేజీలో సీటు సాధించాడు. తల్లిదండ్రులు పింజరి రెహమాన్, మహబూబ్‌బీ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. తమ కుమారుడు రజిత్ నీట్‌లో 582/720 మార్కులు సాధించి మొదటి విడత కౌన్సెలింగ్‌లోనే కర్నూలు మెడికల్ కాలేజీలో సీటు దక్కిందని ఆనందం వ్యక్తం చేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు రజిత్‌ను అభినందించారు.

కారు బోల్తా - ముగ్గురికి గాయాలు

ఆస్పరి: మండలంలోని బిల్లేకల్లు గ్రామ సమీపంలో సోమవారం కర్ణాటకకు చెందిన కారు బోల్తా పడడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. రైతులు, కూలీలు తెలిపిన వివరాల మేరకు.. బెంగళూరుకు చెందిన కుటుంబ సభ్యులు మంత్రాలయంలో రాఘవేంద్రస్వామిని దర్శించుకుని తిరిగి వెళ్తుండగా బిల్లేకల్లు వద్ద అదుపు తప్పి కారు బోల్తా పడింది. గాయపడిన ముగ్గురిని సమీప పొలాల్లో పని చేస్తున్న రైతులు, కూలీలు వచ్చి ఆటోలో ఆస్పరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లారు. విషయాన్ని ఆస్పరి సీఐ మస్తాన్‌వలి దృష్టికి తీసుకెళ్లగా కారు బోల్తాపడిన సంఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని, గాయపడిన వారు వివరాలు తెలిపితే కేసు నమోదు చేస్తామని చెప్పారు.



బోల్తా పడిన కారు

నేడు దివ్యాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీ

హొళగుంద: దివ్యాంగులు, సీనియర్ సిటిజన్‌లకు నీతి అయోగ్ ద్వారా ఏడీఐపీ స్కీంలో భాగంగా అస్పిరేషన్ బ్లాక్‌లో మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ట్రైసైకిళ్లు, పరికరాలున ఉచితంగా పంపిణీ చేస్తామని ఎంపీడీఓ సుహాసినమ్మ, ఏబీఎఫ్ రవిశంకర్ సోమవారం తెలిపారు. నీతి అయోగ్ ద్వారా 13 వీల్ చేర్స్, 16 మోటరైజ్‌డ్ ట్రైసైకిళ్లు, 47 ట్రైసైకిళ్లతో పాటు స్టిక్స్ తదితర వాటితో కలిపి 267 పరికరాలను (33 రకాలు)167 మందికి అందజేస్తామని చెప్పారు.



హొళగుందకు వచ్చిన ట్రైసైకిళ్లు

కొనసాగుతున్న మారెమ్మ బ్రహ్మోత్సవాలు

కృష్ణగిరి: పుట్లూరు గ్రామంలో మారెమ్మ బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామస్తులు ప్రతి ఇంటి నుంచి తెచ్చిన నైవేద్యంతో పూజలు చేశారు. వేడుకల్లో భాగంగా నిర్వహించిన పొట్టేళ్ల పోటీల్లో గెలుపొందిన యజమానులకు దాతలు, నిర్వాహకులు బహుమతులు అందించారు. అలాగేడీజే కోలాటం అలరించింది. మంగళవారం అమ్మవారికి బోనాల సమర్పణ ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



పూజలందుకుంటున్న అమ్మవారు

టీబీ డ్యాం గేట్లు మూసివేత

హొళగుంద: కర్ణాటక రాష్ట్రం హొస్పేట్‌లోని తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో తగ్గడంతో సోమవారం టీబీ బోర్డు అధికారులు క్రస్ట్ గేట్లన్నీ మూసివేశారు. సోమవారం ఉదయం ఇన్‌ఫ్లో 18,737 క్యూసెక్కులుండగా 18,137 క్యూసెక్కులు అవుట్ ఫ్లో ఉంది. తుంగభద్ర డ్యాం పూర్తి సామర్థ్యం 1633 అడుగులతో 105.788 టీఎంసీలకు గాను సోమవారం తెల్లవారుజాము వరకు 1,632 అడుగుల వద్ద 101.773 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దీంతో అప్పటి వరకు 4 గేట్లు మాత్రమే తెరిచి ఉంచిన అధికారులు ఉదయం అన్ని గేట్లను మూసివేశారు. ఇక ఎల్లెల్సీకి సంబంధించి ఆంధ్ర కాలువ పరిధి ప్రారంభం 250 కి.మీ వద్ద 606 క్యూసెక్కులు ప్రవహిస్తున్నాయి.

ఈ-క్రాప్ నమోదుకు గడువు పెంపు

మద్దికెర : ఖరీఫ్ సీజన్ పంటల ఈ–క్రాప్ నమో దుకు ఈ నెల 30వ తేదీ వరకు గడువు పెంచినట్లు ఏఓ రవి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో 15వ తేదీ వరకే గడువుండగా తాజాగా ప్రభుత్వం పొడిగించినట్లు చెప్పారు.

హాలహర్వి: మండలంలో ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగుచేసిన రైతులు పంటల నమోదు చేయించుకుని ఈ–కేవైసీ చేయించుకునేందుకు ఈనెల 23వ తేదీ వరకు గడువు పొడిగించారని మండల వ్యవసాయ అధికారి శివశంకర్ తెలిపారు. సోమ వారం ఆయన మాట్లాడుతూ ఈ–కేవైసీ పూర్తయితేనే పంటల నమోదు పూర్తి అయినట్లని చెప్పారు.

హొళగుంద: సాగు చేసిన పంటల ఈ–క్రాప్ నమోదుకు ఈ నెల 23వ తేదీ వరకు గడువు పొడిగించాని రైతులు తప్పనిసరిగా ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలని ఏఓ ఆనంద్ లోకదళ్ తెలిపారు.

ప్రజలు జాగ్రత్తలు పాటించాలి

దేవనకొండ: ప్రజలు ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలని హోమియోపతి వైద్యుడు యు.సోమశేఖర్‌రెడ్డి సూచించారు. సోమవారం తెర్నెకల్ గ్రామంలోర సర్పంచ్ అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. మలేరియా, డెంగీ, చికున్‌గున్యా వంటి వ్యాధులకు హోమియోపతిలో వైద్యం ఉందన్నారు. 200 మందికి ఉచిత మాత్రలు అందించామన్నారు. బాపిందొడ్డి నాగభూషణం, గడ్డం నాగరాజు, ఎంపీటీసీ నామాల శ్రీనివాసులు పాల్గొన్నారు.